# ఆర్ట్ ఎటాక్!

కండితి తొట్టి అనుకుని నీలం తొట్లోపడ్డ నక్కలా రంగు చూసుకుని మురిసిపోయి, పొగరువల్లో, పురుగు పూదో ఒళ్ళు వాస్తే, ఆ వాపును చూసి బలం అనుకుని పొంగిపోతున్నాం! మనకి అహంకారమేకాని ఆకారం యింకా ఏర్పడలేదు. మనకి పంపుకొట్టేవాళ్ళు ఎక్కువయారని మనం సంతోషిస్తున్నామే కాని, మన రచన్స్ కంపుకొడుతున్నాయని మనం గుర్తించడంలేదు. దట్సాల్ రైట్! వరి పండించవలసినచోట పొగాకు పండించినట్లు (ఆంధ్ర రచయిత్రుల అహంకార దర్పణంగుండా చూస్తే) కరుణ కలగవలసినచోట హాస్యం, శృంగారం పుట్టవలసినచోట భీభత్సం కలిగిస్తున్నామేమో .... సొసైటీలో చాలా వేగంగా వచ్చే మార్పుల్ని సహించి తట్టుకోలేక మనం ఏడవవలసినచోట నవ్వుతున్నాం (మరియు) నవ్వవలసినచోట ఏడుస్తున్నాం. ఆర్ట్ తెలియనివాళ్ళకి హార్ట్ ఎటాక్ రాదు. మన రచయిత్రులకి అందుకే హార్ట్ ఎటాక్ రాదు. (పాఠక్సుకి రావచ్చు, పబ్లిషర్లకి రావచ్చు. పత్రికలకుకూడా రావచ్చు) సినిమాలకు ఆర్ట్ ఎటాక్ వస్తుంది. ఆ ఆర్ట్ ఎటాక్ పలక్కపోతే నిర్మాతలకు హార్ట్ ఎటాక్ రావచ్చు. కళ అని అమ్మాయి పేరు. ఎక్కడా మొహంలో కళ వుండదు, సరస్వతికి సంతకం రానట్టు. బై ది బై — సొసైటీలో రచయిత, కవి, నటుడు వగైరాలను కట్టుకుని అష్టకష్టాలుపడ్డ ఆడవాళ్ళ స్టోరీస్ మనం చెప్పుకున్నాం. చెప్పుకుని నవ్వుకున్నాం. ఇప్పుడు "రచయిత్రి మొగుడు" ఒక కొత్తపాత్ర. సినీతార భర్తలా ఇతగాడూ ఒక కొత్తపాత్ర. సినీతార భర్తలా ఇతగాడూ ఒక మసగేసిన బొమ్మే! పెళ్లాం చేతిలో ఓ అట్టుండగానే సరికాదు. ఆ అట్టు

ఎటాక్ భరించగలిగినవాడే భర్త. ఒకరకంగా పాఠకుస్కూడా భర్తలే. కాని అలా పైకనకూడదు. అంటే లెంపలేసుకోవాలి- లేసుకుంటాను.

కవిగారి పెళ్ళాం, రచయిత భార్య, మహానటుడి యిల్లాలు మనకు తెలిసిన పాత్రలు. రచయిత్రి మొగుడు, జీవిత నాటకరంగంలో జస్ట్ ఇప్పుడిప్పుడే అవతరించిన ఒక కొత్తపాత్ర. ఇది కరుణరసప్రధానమైన పాత్రో, హాస్యపాత్రో నిర్ణయించవలసినది పాఠకులుకాదు రచయిత్రులే. నిజంగా బాగా సీరియస్‌గారాసే మొగాడికి పెళ్ళాం న్యూసెన్స్ అయినట్లు, మహారచయిత్రికి భర్త పరమ న్యూసెన్స్‌గాడని ఎప్పుడో ఒకప్పుడనిపించక మానదు. రచయిత్రి అంటే గొప్ప ఎమోషనల్ సెంటిమెంటల్ బీయింగు (అవతారం) కదా! అటువంటి అవతార స్త్రీకి (పురుషుడు కాదని గుర్తించాలి) మొగుడుగాడు పెద్ద న్యూసెన్స్.... అలా అని పైకి చెప్పుకోడానికి వీల్లేదు. హిందూ సొసైటీలో మొగుడు న్యూసెన్స్‌అని ఎవరైనా అన్నదంటే దాన్ని తవ్విపాతేస్తారు. గనుక ముద్దుగా "నాభర్త నన్ను అర్థంచేసుకోవడంలేదు" అని అంటుంది. రచయితల అనార్కీని రచయితల పెళ్ళాలు సహింపడంలేదా. రచయిత్రుల అహంభావాన్ని భరించి తట్టుకుని ధైర్యంగా నిలబడవలసినవాడు మన జాలి కథానాయకుడు, రచయిత్రిగారి మొగుడుగారే! కొండొకచో అతను దుష్టుడయి విలనుగా మారితే బావగా, ఆమె- అనగా రచయిత్రి భావస్వాతంత్ర్యాన్ని హరించి వేయడంకూడా కద్దు. పెళ్ళాం సిగరెట్టుపెట్టి, అగ్గిపెట్టి, పేకదస్తా, చెప్పులు, మనీపర్సు దాచేస్తే ఆవిడకూడా బావస్వాతంత్ర్యాన్ని హరించినట్టేకదా! స్త్రీలను పురుషులు వైస్‌వెర్సా అర్థంచేసుకోవడంలేదనే స్లోగన్ ఒక ఆర్ట్ ఎటాక్. ఆడవాళ్లు తమకు న్యూసెన్స్ కలిగించే సంగతులనుకూడా కడు సుతారంగా చెప్తారు. దే ఆర్ ఫైన్ క్రీచర్స్ (వారు చాలా చక్కని సూక్ష్మజీవులు)

లీజర్ అనగా విశ్రాంతి. అది సొసైటీలో ఎవరికి ఎక్కువగా దొరికితే వారు సోమరిపోతులేనా అవుతారు, రచయిత్రులు కళాకారులైనా

అవుతారు. భర్త లీజరు యివ్వకపోతే భార్యభావాలు కళ్ళలో చూసి చదవాలిసిందే కాని కాగితంమీదకు అవి బట్వాడా కావడానికి వీలుండదు. సమయమూ స్వేచ్ఛా (దో యా తీన్) ఆవేశమూ, ఈ మూడున్నూ దస్తా కాగితాలూ కలం సిరాబుడ్డి పోస్టుబిళ్ళలూ కవర్లూ, వీటిని కాపీచేసి పోస్టు చేసే మొగుడూ, అంకితం పుచ్చుగోవడానికి వెంకటేశ్వరస్వామి కల రచయిత్రి ధన్యురాలు.

ఒకరికి విశ్రాంతిని ఇవ్వాలంటే మరొకరు ఆ మేరకు కష్టపడాలి. అది రూలు. కొంతమంది సుఖంగా సంతోషంగా జల్సాగా పూలరంగళ్ళు పూలరంగమ్మల్లా వున్నారంటే, చాలామంది సుఖంగా సంతోషంగా వుండడానికి అవకాశం లేకుండా కష్టపడుతున్నారన్నమాట. ఈ సింపిల్ రూల్ ప్రకారం "రచయిత్రి మొగుడు" ఆవిడకు తెల్లకాగితాలు, సిరాబుడ్డీ, ఊటకలం కొనిస్తే చాలదు. ఆవిడ రెస్పాన్సిబిలిటీస్ (లోపలపడకుండా) అనగా పిల్లల్ని ఆడించుట, బాయిలర్ ముట్టించి నీళ్ళు కాచి పిల్లలకు స్నానంచేయించి టిఫిన్‌బాక్స్ సర్ది పుస్తకాలు చేతికిచ్చి బళ్ళోకి పంపుట, ఆవిడగారికి ఆరారగా టీ, కాఫీ, కోకో, హార్లిక్సు కలిపి యిచ్చుట, మరియు ఆమెను తుచ్ఛ ఐహిక సుఖములకోసము బాధించక వసారాలో మడతమంచము వాల్చుకుని పరుండుట, ఇవి రచయిత్రి మొగుడి కనీసధర్మాలు.

దేవుళ్ల బొమ్మలచుట్టూ కాంతిచక్రము వున్నట్లు కొన్నాళ్ళయాక రచయిత్రిచుట్టూ ఆమె కీర్తివలన బయల్దేరిన కాంతి, చక్రంలా తిరుగుతూ ఉంటుంది. ఫిజిక్సులో కాంతి-వేడి గురించి చిన్నప్పుడు చదువుకున్న మొగుడికి ఆ రెంటి వేడి బాగా తగుల్తుంది. ఆవిడ కీర్తి శరీరంతో కాపురం చేయడం మొగుడిగారికి కష్టవే — అంచాత క్లబ్బులో పేకాడి, రోడ్ల మీదతిరిగి, తాగి దెబ్బలాటలు తీసుకొచ్చి టెరిబుల్ న్యూసెన్స్‌గా తయారవుతారు. లోపల ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సుతో, పెళ్ళాం రేడియోలో మాట్లాడి వచ్చినరోజునో, మీటింగుకో, సన్మానికో వెళ్లి వచ్చినరోజునో,

ఏదన్నా పెద్దచెక్కు ఆవిడకు వచ్చినరోజునో, పోట్లాడేసుకుని బూతులు తిట్టి తన్ని కొట్టినంత పన్చేసి ఆవిడను ఏడిపిస్తేనేకాని వాళ్ళకు తృప్తిగా వుండదు. ఇది బాగా శృతిమించిన స్టేజీలో పబ్లీకున ఆమె అభిమానుల ఎదుట అవమానించి, దూషించి, అగౌరవపరిచి సంతోషిస్తూవుంటారు మగాళ్ళు (నాట్ ఆల్). మనం రచయిత్రులం, కళాకారులం ఐనప్పటికీ సామాన్యులంగా వుండిపోగలిగితే అది గొప్పవరమే! మన వ్యక్తిత్వాన్ని మనం హెచ్చుగా అంచనా వేసుగుని వాపునుచూసి బలం అనుకుని విర్రవీగితే, అప్పుడు అహంకార సరస్వతులమై పోతాముకాని నిజమైన ఆర్టిస్టులం కాలేము. లోపల ఈ మొగుడొద్దు ఈ కాపురం వద్దు అని తిట్టుకుని పైకి సరిగా అర్థంచేసుకుంటే చాలు అనే రచయిత్రులకి నేనొక్క మాట చెప్తాను. సంప్రదాయాన్ని ధిక్కరించైనాసరే, విలువల్ని మూలమట్టంగా పడగొట్టి ఐనాసరే, వ్యక్తిత్వాల్ని చంపుకోకండి. వ్యక్తిత్వాల్ని చంపుకుని కాపురాలు చెయ్యడం వ్యభిచారంకంటె మహాపాపం! నూటికి తొంభై పై చిలుకు స్త్రీలు యిష్టంలేని కాపురాలను ఏడుస్తూచేస్తారు. లేని బావకంటె గుడ్డిబావ మేలు అని సామెతవుందికదా! మొగుడు రెండుతగల్నిచ్చినా అప్పుడప్పుడు ముద్దుపెట్టుకుంటున్నాడుగదా అని సంతోషించే ఆడాళ్ళే మనదేశంలో ఎక్కువమంది. తిండి, బట్ట యిచ్చి పోషించే మగాడు తంతే తప్పేవిటి అనే ఉగ్రవర్ణ్షులున్న మనదేశంలో స్త్రీని గురించి ఆలోచించడం మొదలిడితే నాకు ఆర్ట్ ఎటాక్ వస్తుంది ఆర్ట్ ఎటాక్ వచ్చి ఏదో వాగాను. డియర్ సిస్టర్స్.... ఐ లవ్యూ మోస్ట్!